
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బుడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# ఫైటర్..!!

" మేమ్! నాది విండో సీట్!" అంది రష్మి, అప్పటికే పక్కన సీట్లో కూర్చున్న పెద్దావిడతో.

" అరే, సారీ నేను ముందే వచ్చేసి కూర్చున్నాను. లేస్తాను, గివ్ మీ వన్ సెకండ్" అంటూ నెమ్మదిగా లేచి నిలబడింది ఆవిడ

నిలబడేటప్పుడు ఆవిడ చేతిలోని రబ్బర్ క్రచ్ కింద పడింది.

ఆవిడ వంగి తీసుకునేలోపు " మీకు నేను హెల్ప్ చేస్తాను " అంటూ రష్మి వంగి, క్రచ్ తీసి ఆవిడ చేతికి అందించింది.

" థాంక్ యూ!" అంటూ నవ్వి పక్కకి జరిగి. రష్మి కి దారి ఇచ్చిందావిడ.

తన చేతిబాగ్ తన కిటికీ సీట్ కి ఎదురుగా కిందకి తోసి సర్దిపెట్టింది. రష్మి సర్దుకుని కూర్చున్నాకా పక్కసీట్లో ఆవిడ కూడా కూర్చుంది.

బాగా ఎత్తుగా, బలంగా ఉందావిడ. ఆరడుగుల మూడంగుళాలైనా ఉండవచ్చు ఆవిడ ఎత్తు, అది కాకుండా ఒత్తుగా బాయ్ కట్ లో చేయించుకున్న ఆవిడ జుట్టు మరో రెండు అంగుళాలైనా ఉంటుంది. వెరసి దగ్గర దగ్గరగా ఆరున్నరడుగుల మనిషి. నల్లటి పాంట్, పైన లేత నీలం రంగు స్వెటర్ వేసుకుంది. మెడలో ఎరుపు నలుపు గళ్లున్న స్కార్ఫ్ వేసుకుంది. నవ్వుతున్నట్టున్న కళ్ళు, సూదిగా ఉన్న ముక్కు, విశాలమైన నుదురు.

"గంటన్నర ప్రయాణం బోస్టన్ నుంచి డెట్రాయిట్.. అంతే కదా?" అడిగింది ఆవిడ.

"అవును "అంది రష్మి.

" ఐ లైక్ జెట్ బ్లూ ఎయిర్లైన్స్". అందావిడ నవ్వుతూ. రష్మి కూడా నవ్వింది, తన ఇయర్ ఫోన్స్ చెవుల్లో పెట్టుకుంటూ...

" మీ స్కార్ఫ్ చాలా బావుంది" అందావిడ.

"థాంక్ యూ.. నా మ్యూజిక్ మీకైమైనా ఇబ్బంది గా ఉందా? " అడిగింది రష్మి ఆవిడని.

"మీరు చాలా కైండ్! లేదంటే మీ మ్యూజిక్ నన్నేమీ డిస్టర్బ్ చెయ్యడం లేదు. కానీ ఇలా అడిగేవాళ్లెవరు?" అందావిడ మెచ్చుకుంటూ.

"నైస్ ఆఫ్ యూ టు సే దట్.. " అంది రష్మి.

"మీరు బోస్టన్ లో ఉంటారా?" అడిగిందావిడ.

"లేదు, పని మీద వచ్చాను " అంది రష్మి.

"ఆఫీస్ పనా?" అడిగిందావిడ.

"అవును.. మీటింగ్! మీరు?" అడిగింది రష్మి..

"నేను మూడేళ్ళక్రితమే రిటైర్ అయిపోయాను, కొడుకు దగ్గరనుంచి వస్తున్నాను, అతను ఆర్మీలో పనిచేస్తాడు" అందావిడ కొద్దిగా గర్వం ధ్వనిస్తున్న గొంతుతో.

"అలాగా? వెరీ నైస్!.. మీరేం చేసేవారు? " అడిగింది రష్మి..

"నా పేరు అమాండా, నేను ఫైర్ ఫైటర్ గా పనిచేసేదాన్ని" అందావిడ.

"ఫైర్ ఫైటరా? చాలా అరుదైన వృత్తి కదూ! " అంది రష్మి.

"అరుదైనదా? కానే కాదు.. నేను స్త్రీ ని కదా అని అలా అడుగుతున్నారు కదూ? లేకపోతే అగ్నిమాపక సిబ్బంది లేకపోతే ఇన్ని ప్రమాదాలు ఎలా నివారింపబడుతున్నాయంటారు?"

"అయ్యో!నా ఉద్దేశ్యం అది కాదు, నేనెప్పుడూ ఈ వృత్తిలో ఉన్నవాళ్ళని కలవనే లేదు, అది కాక ముఖ్యంగా మీరన్నట్లు మహిళలని."

"అసలీ వృత్తి ఎంచుకోవాలని మీకెందుకనిపించింది? మీకభ్యంతరం లేకపోతే కొంచం వివరంగా చెప్పండి" అంది రష్మి.

కొత్తవారితో కూడా అందంగా కబుర్లు చెప్పడం ఆవిడ ప్రత్యేకత అని అప్పటికే తెలిసింది రష్మికి, అందుకే అడిగింది.

రష్మి అలా అనడంతో ఆవిడకి చెప్పలేనంత ఉత్సాహం వచ్చింది.

"ష్యూర్!" అంటూ మొదలుపెట్టింది కాఫీ సిప్ చేస్తూ.

" నాకెందుకో చిన్నప్పటినించీ క్లాస్ రూములో కూర్చుని చదువుకోవడం కన్నా, బయట ఆటలు ఆడడం లో ఎక్కువ ఉత్సాహంగా ఉండే ది. ముఖ్యం గా చెట్లు ఎక్కడం లాంటివంటే మరీను. దానికి తోడు నా హైట్, చూశారుగా ఎంత పొడుగున్నానో. దానివల్ల కూడానేమో మరి తెలీదు. అటకలమీదున్నవి, లేదా బాగా ఎత్తుగా ఉన్నచోట్లకి చేరటానికి అమ్మ కష్టపడుతుంటే నేను చిటికెలో తీసి ఇచ్చేసేదాన్ని. అమ్మ అందంగా నవ్వుతూ ఉంటే ఎంతో గర్వంగా అనిపించేది."

"అది ఒకటైతే చిన్నప్పటినించీ నాకు వాహనాలంటే వీపరీతమైన ఇష్టం, ఎప్పుడూ కార్లు, జీప్ లు లాంటి బొమ్మలతోనే ఆడేదాన్ని. వీధిలో కూర్చుని నేనూ మా తమ్ముడూ వచ్చే పోయే వాహనాలని చూస్తూ, ఏ రకమైనవెన్ని వెళ్ళాయో, లెక్కపెడుతూ ఆడేవాళ్ళం. మా అన్నయ్యలు కోప్పడేవారు. " అంది ఆవిడ నవ్వుతూ..

'ఏ దేశం లోనైనా పిల్లలు ఒకేలాంటి ఆటలాడుతారా?' అనిపించింది రష్మికి.

"అన్ని వాహనాల్లోకి సైరన్లు మోగించుకుంటూ వెళ్ళే యాంబులెన్స్ లన్నా, అగ్ని మాపక వాహనాలన్నా ప్రత్యేకమైన ఇష్టం ఆ చిన్నవయసులోనే ఏర్పడింది. తెల్లగా ఉండే యాంబులెన్స్ కన్నా చూడగానే ఎర్రరంగులో మెరిసిపోయే అగ్నిమాపక వాహనాలంటే కొద్దిగా ఎక్కువే అని చెప్పాలి. గంటలు మోగించుకుంటూ వెళ్ళే ఆ ఎర్ర వేన్ ల ని చిన్నప్పటినించీ ఎంతో ఇష్టంగా చూసేదాన్ని ఎక్కడ చిన్న అగ్నిప్రమాదం జరిగినా, గబ గబా వచ్చి మంటలార్పి, అందరినీ కాపాడే ఆ ఆఫీసర్లంతా నా చిన్న కళ్ళకి దేవతల్లా కనిపించేవారు. అలా మొదలయింది ఆ వృత్తి మీద నా ఇష్టం. నాకు పదిహేనేళ్ళున్నప్పుడనుకుంటా మా అమ్మతో గట్టిగా చెప్పేశాను నాకు ఈ ఉద్యోగమే చెయ్యాలని ఉందని. ఆవిడ మొదట ఆశ్చర్యపోయింది, మా నాన్నగారికి చెప్పింది.. "

ఆవిడ ఉత్సాహంగా చెప్పుకుపోతూ ఉంటే, దాన్ని ఆపడం ఇష్టం లేనట్టుగా ఆసక్తిగా వినడం మొదలు పెట్టింది రష్మి.

"బోర్ కొట్టిస్తున్నానా?" అంటూ నవ్విందావిడ.

" లేదు, లేదు.. చెప్పండి" అంది రష్మి ఉత్సాహంగా.

" ఆవిడ మా నాన్నతో చెప్పింది, ఇద్దరూ కలిసి నాకు నచ్చచెప్పాలని ప్రయత్నించారు. హాయిగా కుర్చీలో కూర్చుని చేసుకునే ఉద్యోగాలు కాక ఈ ప్రాణం మీదకొచ్చేవి ఎందుకు? అందులోనూ ఆడపిల్లలకి అని.. " అందావిడ.

"ఇక్కడ, ఐ మీన్! మీ దేశంలో నూ ఉన్నాయా అలాంటివి?" అంది రష్మి అధాట్టున.

" ఏ దేశంలోనైనా అమ్మాయిలు ఒకటే కదూ!" అందావిడ నవ్వుతూ..

" సారీ, అది కాదు. మొదటినించీ ఇక్కడందరినీ సమానంగా పెంచుతారు కదా, అని" అంది.

" మీరన్నది నిజమే కానీ నేను మాట్లాడుతున్నది చాలా ఏళ్ళ క్రితం కదూ" అంది.

" నిజమే, తర్వాత?" అంది రష్మి.

"మొదట కొన్ని నెలల శిక్షణ పూర్తి చేసుకుని ఉద్యోగంలో ప్రవేశించాను. నాకు సంతృప్తి కలిగేలా, మా అమ్మా, నాన్నలు గర్వపడేలా, విధి నిర్వహించి ఎన్నో అవార్డులు, రివార్డులు పొందాను. తన ఆఫీసులో జరిగిన ప్రమాదాన్ని నివారించినప్పుడు మొదటిసారి రాబ్, నేను కలిశాము.

రాబ్ ఆర్కిటెక్ట్, తన స్వంతంగా ఆఫీస్ పెట్టుకున్నాడు. పదిమంది ఉన్న తన కంపెనీ కోసం ఒక ఆఫీస్ కాంప్లెక్స్ లో నాలుగో అంతస్తులో ఆఫీస్ తీసుకున్నాడు. ఆరోజు అనుకోని విధంగా అతని ఆఫీస్ లో నిప్పు రాజుకుని ప్రమాదం జరిగింది. మేము సమయానికి వెళ్ళి ఏ నష్టం జరగకుండా కాపాడాము.

నిచ్చెనలేసుకుని, నాలుగో అంతస్థువరకూ ఎక్కి కిటికీలోంచి దూకి పని చేశానేమో, పాపం రాబ్ చాలా ఇంప్రెస్ అయిపోయాడు నన్ను చూసి. నేనో పెద్ద హీరోనయిపోయాను. ఆయన దృష్టిలో. నాకన్నా రెండంగుళాలెక్కువ ఎత్తుంటాడు కానీ రెండడుగులమించి ఎద్దైనా ఎక్కాలన్నా, దూకాలన్నా కూడా భయమే అతనికి."

అప్పటిప్రేమ గుర్తొచ్చినట్టుంది ఆవిడ నవ్వు ముఖం మరింత మెరిసింది

"అలాగా? బావుంది.. " అంది రష్మి.

బావుంది కదా, అలాగే రాబ్ తో జీవితం ముడివడి, ఇప్పటివరకూ బావుంది. మా నలుగురు పిల్లలు, ఇద్దరమ్మాయిలు, ఒకబ్బాయి డెట్రాయిట్ లోనే ఉంటారు. ఇప్పుడు నేను వెళ్ళిన అబ్బాయి మాత్రం యూరోప్ లో ఉంటాడు." చిరునవ్వుతో అందావిడ

"ఇంకేం? కథ అలా సుఖాంతమైందన్నమాట !" అంది రష్మి ఆవిడ నవ్వుతో శృతి కలుపుతూ.

" చాలావరకూ అంతే, నాకు యాక్సిండెంట్ అయ్యేంతవరకూ!" అంది అమాండా.

" యాక్సిడెంటా? అదేమిటి? ఎలా అయింది?" అంది రష్మి..

"అదో చిన్న కథ, ఓ పెద్ద హోటెల్ లో ప్రమాదం సంభవిస్తే పరుగున వెళ్ళాము. ముందూ వెనకా చూడని దూకుడే కదా, మనదెప్పుడూ! ఎప్పటిలాగే గబ, గబా పొడవాటి నిచ్చెన ఎక్కి మంటలార్పాము నేను నా సహోద్యోగులు.. అనుకోని సంఘటనవల్ల నేను కిటికీ అంచు మీద నుంచి కింద పడిపోయాను.. అంతే నాకు గుర్తుంది.. కళ్ళు తెరిచి చూసేసరికి నా చెయ్యి పట్టుకుని, నా కళ్లల్లోకే చూస్తున్న రాబ్, పిల్లలు, అమ్మా, నాన్నా..

అమ్మ ఒకటే ఏడుపు.' అప్పుడే వద్దన్నాను!' అంటూ..

రాబ్ ధైర్యం చెప్పాడు ప్రత్యక్షంగా అమ్మకి, పరోక్షంగా మా అందరికీ..

'లేదు, అలా అనకండి, నాలాంటివాడిని చెయ్యమన్నా చెయ్యలేను. అమాండా ధైర్యమే మా కుటుంబానికి రక్ష. తనని ఉత్తేజపరచవలసిన ఈ సమయంలో మనం నీరు కార్చ కూడదు. తను తప్పకుండా అతి త్వరలోనే కోలుకుంటుంది బికాజ్ షీ ఈజ్ ఏ ఫైటర్.. కేవలం అగ్ని ప్రమాదాలనే కాదు, జీవీతంలో తగిలే దెబ్బలని కూడా సమర్ధవంతంగా ఎదుర్కొనే గొప్ప ఫైటర్ !' అన్నాడు.. నా చేతి మీద తనచేతి పట్టుని బిగిస్తూ..

పిల్లలందరూ కూడా తడికళ్ళతో నవ్వుతున్న ముఖాలతో చూశారు. కుడి పక్కకి పడడం వల్ల పక్కటెముకలు దెబ్బ తిన్నాయి, మోకాలు బాగా ఫ్రాక్చర్ అయింది. కోలుకోవడానికి మూడు నెలలు పట్టింది. పక్కటెముకలు త్వరగానే అతుక్కున్నాయి. మోకాలు మాత్రం ఇప్పటికీ ఇబ్బంది పెడుతూనే ఉంది. అందుకే ఈ చిన్న క్రచ్ పెట్టుకుని నడుస్తాను, అంతే కాదు! మోకాలి దగ్గర సపోర్ట్ కోసం ఒక నైలాన్ బ్రేస్ పెట్టుకుంటాను. అది ప్రతీ సారీ సెక్యూరిటీలో నన్ను ప్రశ్నలకి గురి చేస్తూ ఉంటుంది" అంది ఆవిడ.

"ప్రతీ సారీ పట్టుకుని చూసి మరీ అడుగుతారు. ఏమిటిది? ఎందుకు పెట్టుకున్నావు లాంటి ప్రశ్నలు. ఇదేమైనా ఆభరణమా పెట్టుకోవడానికి, అదే నాకు చిరాకు" అందావిడ కోపంగా.

" అయ్యో! అవునా? అప్పుడు మరి ఏం చేశారు? మీ ఉద్యోగం మానేశారా?"

నవ్విందావిడ పక పకా..

" అలాగే అనుకుంది మా అమ్మ కూడా. కానీ నేను వెళ్ళి మళ్ళీ చేరతాను, నాకు అవకాశం ఇవ్వమని అడిగాను.. వాళ్ళేం చేశారో తెలుసా? నామీదున్న గౌరవంతో, అంతకుముందు నేను చేసిన సర్వీస్ కి గుర్తింపుగా నాకు పదోన్నతి ఇచ్చి, నన్ను సూపర్ వైజర్ ని చేశారు.

మీకు తెలుసుకదా! సూపర్ వైజర్ అంటే పని చెయ్యక్కర్లేదు.. అజమాయిషీ చేస్తే చాలు . అదొక్కటే నా బాధ అయింది. ఉద్యోగం ఉండడం ఒక్కటే కాదు కదా, మనసుపడే కొలువుండాలి కదా.!" . అంది..

" పైకెక్కదన్నారు, కనీసం మెట్లు కూడా. అందుకే మా ఇంట్లో అప్పటికప్పుడు కింద సంతస్తులో ఒక పడకగది ఏర్పాటు చేశాము. లైఫ్ వస్ గోయింగ్ ఆన్ వెల్, కానీ ఎత్తు ఎక్కలేను, నన్ను పని చెయ్యక్కరలేని సూపర్ వైజర్ సీట్లో కూర్చోబెట్టారే అని నా మనసు అసంతృప్తితో కొట్టుకుపోయేది. నా కీ ప్రమోషన్ లో సంతోషం కనిపించలేదు. ఎవరికైనా చెప్తే పిచ్చితనం అనుకుంటారని నన్ను కోప్పడతారని తెలుసు. కానీ నేననుకున్న పని సమర్ధవంతంగా చెయ్యలేకపోతున్నానన్న బాధ నన్ను క్షణం నిలబడనిచ్చేది కాదు. అందుకే రాబ్ సహాయంతో మూడో మనిషి కి తెలియకుండా కొంత ప్రత్యేక శిక్షణ తీసుకున్నాను. " ఆవిడ చెప్పేది ఆశ్చర్యంగా వింటోంది రష్మి.

"కాళ్ళు లేకుండా పర్వాతాలెక్కిన వారున్నారు. చేతుల్లేకుండా మనుషుల్ని చిత్తరువులని చేసే చిత్రకారులున్నారు. వారితో పోలిస్తే నాకున్నదీ ఒక సమస్యేనా అనుకున్నాను తప్ప ఇదేమీ పెద్ద అవకరమనో, అవరోధమనో అనుకోలేదు. రిటైరయ్యే లోపు ఒక్క సారి రెండో అంతస్తులోని మంటలని నిచ్చెన ఎక్కి మరీ అరికట్టాను. ఆ తృప్తితో రిటైర్ అయ్యాను. అంతే.."అందావిడ.

ఆవిడ ముఖంలో అంతులేని తృప్తి, ఆనందం, చిన్నపాటి గర్వం.

చిన్నపిల్లలా చప్పట్లు కొట్టింది రష్మి ఆవిడ పూర్తి చెయ్యగానే.

"థాంక్ యూ!" అందావిడ ఆప్యాయంగా రష్మి వైపు చూస్తూ..

"కేబిన్ క్రూ, బీ సీటెడ్ ఫర్ లాండింగ్" ప్రకటన వినపడింది..

విమానం ఆగిన తర్వాత ఆవిడ నెమ్మదిగా లేచి నిలబడింది.. ఒక చేత్తో తన క్రచ్ ని పట్టుకుని మరో చేత్తో పైనున్న సామన్ల లాకర్ ని తెరిచింది. అక్కడున్న తన సూట్ కేస్ ని తియ్యడానికి చెయ్యి చాపుతుంటే పక్కనున్న ప్రయాణీకుడు 'నేను తీసిపెట్టనా మేమ్? ' అన్నాడు..

"అయ్యో, వద్దు,, నేను తీసుకుంటాను" అంటూ రెండో చేత్తో పైనున్న తన పెట్టెని తీసుకుని..

" నిన్ను కలవడం చాలా సంతోషం, నా సొదంతా విన్నందుకు ధన్యవాదాలు తల్లీ, నీకు ఆల్ ది బెస్ట్" అని రష్మితో చెప్పి హుందాగా ముందుకు నడిచిందావిడ.

●●●

Click here to share your comments on this story